
సాక్షి గుంటూరు

శుక్రవారం : 26 : ఏప్రిల్ : 2024



పరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన

తెనాలి: పరంజ్యోతి సేవాసంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం బుర్రిపాలెం వద్ద నూతనంగా వరసిద్ధి శ్రీపరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి: చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల పవళింపు సేవ గురువారం నిర్వహించారు.

న్యూస్‌రీల్

29న సీఎం వైఎస్ జగన్ పొన్నూరు రాక

పొన్నూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29వ తేదీన పొన్నూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

శరవేగంగా అభయాంజనేయ స్వామి మండప నిర్మాణం



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి మండప నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి వారి విగ్రహానికి మండప నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మండపనిర్మాణ పనులలో భాగంగా శ్లాబ్ పనులు గురువారం నుంచి ప్రారంభించామని, త్వరలోనే అభయాంజనేయస్వామి భక్తులచే పూజలు అందుకోబోతున్నారని వివరించారు. గుదిమెల్ల రఘునాథ్, నారాయణ, ఆలయ అర్చక బృందం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్ నమూనా పరీక్షకు విశేషస్పందన



తెనాలిఅర్బన్: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వైష్ణవి జూనియర్ కళాశాల, సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఈఏపీసెట్ నమూనా పరీక్షను నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ మాట్లాడుతూ నమూనా పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహించడం జరిగిందని తెలిపారు.

ఎన్నికల పరిశీలకునితో కలెక్టర్ భేటీ



గుంటూరు వెస్ట్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మంగళగిరి, తెనాలి, పొన్నూరు శాసన సభ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు నీరజ్ కుమార్‌తో గురువారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో భేటీ అయ్యారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంపై నీరజ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలు కూడా ప్రశాంత వాతావరణంలో జరుగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

యార్డులో 66,153 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 62,762 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 66,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 45,199 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

ప్రచార పర్వం







సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు తమ ప్రచారం ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ తాడికొండ అభ్యర్థి మేకతోటి సుచరిత తాడికొండ మండలం కంతేరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదేవిధంగా తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప పట్టణంలోని 11వ వార్డులో ప్రచారం నిర్వహించి, ప్రజలను ఓటు అభ్యర్థించారు. పొన్నూరులో పార్టీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ తరపున ఆయన సోదరి తీగల వాణిశ్రీ పట్టణంలోని 30 వార్డులో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. - తాడికొండ, తెనాలి అర్బన్, పొన్నూరు

మెయిన్స్‌లో గుంటూరు మెరుపులు

- జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులు సాధించిన గుంటూరు కుర్రోడు ఎం.జిష్ణుసాయి
- అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు కైవసం
- ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించిన సాయి యశ్వంత్‌రెడ్డి



జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లు ఎం.జిష్ణుసాయి, సాయి యశ్వంత్‌రెడ్డిలను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ, ఆనంద్

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్‌లో గుంటూరు నుంచి ఇద్దరు విద్యార్థులు అఖిల భారత స్థాయి ఓపెన్ కేటగిరీలో టాప్-50లో నిలిచారు. దేశవ్యాప్తంగా 15 లక్షలమంది విద్యార్థులు పోటీ పడిన జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో గణిత, భౌతిక, రసాయన శాస్త్రాల వారీగా ప్రతి సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు కైవసం చేసుకున్న విద్యార్థి ఎం.జిష్ణుసాయి 100 పర్సంటైల్‌తో 18వ ర్యాంకు సాధించాడు. గుంటూరులోనే జేఈఈ మెయిన్స్‌కు సన్నద్ధమైన కర్నూలుకు చెందిన మరో విద్యార్థి ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 36వ ర్యాంకు సాధించాడు. వారి భవిష్యత్తు ప్రణాళికలు వారి మాటల్లోనే....

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం..

: ఎం.జిష్ణుసాయి, 18వ ర్యాంకర్

మా స్వస్థలం గుంటూరు. పదో తరగతి వరకు ఐసీఎస్ఈ సిలబస్‌లో చదివాను. ఇంటర్మీడియెట్ వరకు ఐఐటీకి ఎటువంటి ఫౌండేషన్ లేదు. సీనియర్ ఇంటర్‌లో 969 మార్కులు సాధించాను. రెండేళ్ల ఇంటర్ చదువుతో పాటు ఐఐటీకి ఇచ్చిన శిక్షణతోనే జేఈఈ మెయిన్స్ రాశాను. 300 మార్కులకు 300 మార్కులు సాధించాను. కాలేజీలో డైలీ, వీక్లీ టెస్టులు రాయడం ద్వారా ఎప్పటికప్పుడు పొరపాట్లను దిద్దుకుంటూ వచ్చాను. అధ్యాపకుల సూచనలు పాటించి, సందేహాలను నివృత్తి చేసుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో మార్కులు సాధించాను. మే నెలలో జరగనున్న అడ్వాన్స్‌డ్‌పై దృష్టి సారించి, సన్నద్ధమవుతున్నాను. అడ్వాన్స్‌డ్‌లో సైతం మెరుగైన ర్యాంకు సాధించి, ముంబై ఐఐటీలో సీఎస్ఈ చదవాలనే లక్ష్యంతో ఉన్నాను.

ప్లానింగ్ పాటిస్తే చాలు..

: ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, 36వ ర్యాంకర్

మా స్వస్థలం కర్నూలు. 6వ తరగతి నుంచి గుంటూరులోనే హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నాను. సీనియర్ ఇంటర్‌లో 980 మార్కులు సాధించాను. ఏప్రిల్‌లో రాసిన సెషన్‌లో గణితంలో 100, ఫిజిక్స్‌లో 95, కెమిస్ట్రీలో 90 మార్కులతో 100 పర్సంటైల్ సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో టాప్ ర్యాంకు కైవసం చేసుకుని, ముంబై ఐఐటీలో సీటు సాధించాలనే ఆశగా ఉంది. కాలేజీలో ఇచ్చిన ప్లానింగ్ ప్రకారం ముందుకెళ్లి మంచి మార్కులు స్కోర్ చేయవచ్చు.

భాష్యంకు టాప్ ర్యాంకులు..

జేఈఈ మెయిన్స్-2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ-జేఈఈ అకాడమీ ప్రభంజనం సృష్టించినట్లు భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారని చెప్పారు. జేఈఈ మెయిన్స్‌లో 300 మార్కులకు గాను 300 సాధించి, 100 పర్సంటైల్ కైవసం చేసుకున్న ఎం.జిష్ణుసాయి అఖిల భారతస్థాయి ఓపెన్ కేటగిరీలో 18వ ర్యాంకు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి సైతం 100 పర్సంటైల్‌తో ఓపెన్ కేటగిరీలో 36వ ర్యాంకు సాధించారని తెలిపారు. వివిధ కేటగిరీల్లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 4వ ర్యాంకు, డి. భరత్‌చంద్ర 20వ ర్యాంకు, కేజే వివేక్ 33వ ర్యాంకు, జి. జాన్ 49వ ర్యాంకు, కె. హర్షిత 50వ ర్యాంకు, పి. శ్యామ్ 62వ ర్యాంకు, జె. మణి ప్రదీప్ 69వ ర్యాంకు, కె. చైతన్య 77వ ర్యాంకు, ఏ. గణేష్‌దత్తా 78వ ర్యాంకు, కె. శ్రేయ 82వ ర్యాంకుతో 100 లోపు అతుత్తమ ర్యాంకులు దక్కినట్లు వివరించారు. 200లోపు 25, 500లోపు 54, వెయ్యి లోపు 78 ర్యాంకులను సాధించి 71.68 శాతం సక్సెస్ రేట్ సాధించారని పేర్కొన్నారు. భాష్యం డైరెక్టర్ హనుమంత రావు, ఐఐటీ కో-ఆర్డినేటర్ ఆనంద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిల్లాలో భారీగా నామినేషన్లు

మంగళగిరిలో అత్యధికంగా 76 నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం పూర్తయింది. ఈ నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల ప్రక్రియ జరిగింది. 26న నామినేషన్ల స్క్రూటినీ జరగనుంది. ఆఖరురోజున భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. గుంటూరు ఎంపీ స్థానానికి సంబంధించి 67 నామినేషన్లు దాఖలయ్యాయి. అసెంబ్లీకి సంబంధించి మంగళగిరిలో అత్యధిక నామినేషన్లు నమోదు అయ్యాయి. మొత్తం 44 మంది అభ్యర్థులు 76 నామినేషన్లు దాఖలు చేశారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి 38 మంది అభ్యర్థులు 55 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 29 మంది అభ్యర్థుల నుంచి 43 సెట్ల నామినేషన్లు స్వీకరించారు. తెనాలి నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 20 మంది అభ్యర్థుల నుంచి 27 నామినేషన్లు దాఖలు అయ్యాయి. తాడికొండ నియోజకవర్గంలో 16 మంది అభ్యర్థులు 24 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రత్తిపాడులో 15 మంది అభ్యర్థులు మొత్తం 30 నామినేషన్లు దాఖలు చేశారు. పొన్నూరు నియోజకవర్గంలో 18 మంది అభ్యర్థులు 27 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

వైద్యరంగంలో నవశకం

అభివృద్ధి పథంలో వైద్య ఆరోగ్యరంగం

- ఐదేళ్లలో జిల్లా వైద్యరంగంలో సమూల మార్పులు
- అత్యాధునిక వసతులతో సేవలందిస్తున్న గుంటూరు జీజీహెచ్
- ఆరోగ్య కేంద్రాల్లో సైతం స్పెషాలిటీ వైద్య సేవలు
- నూతనంగా ఆరోగ్య కేంద్రాలు నిర్మాణం

ఇది కదా.. అభివృద్ధి

గుంటూరు మెడికల్: గత ప్రభుత్వాల్లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వెళ్తే సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవడమే కాకుండా, మందులు కొరత వంటి సమస్యలతో రోగులు చాలా ఇబ్బంది పడేవారు. పేదలకు గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లోనే నాణ్యమైన వైద్యసేవలు, స్పెషాలిటీ వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక వైద్య రంగం రూపురేఖలు మర్చారు.

సమూల మార్పులు..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో జిల్లా వైద్య రంగంలో నవశకం ప్రారంభమైంది. గుంటూరు వైద్య కళాశాలను ఆధునికీకరించేందుకు నాడు- నేడులో రూ.500 కోట్లు నిధులు ఇవ్వటమే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లాకు పల్నాడు, బాపట్లలో రెండు నూతన వైద్య కళాశాలలు మంజూరు చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. పిడుగురాళ్ల వైద్య కళాశాల నిర్మాణం కోసం రూ. 500 కోట్లు, బాపట్ల వైద్య కళాశాల నిర్మాణం కోసం రూ.293 కోట్లు, గుంటూరు వైద్యకళాశాల పీజీ సీట్ల కోసం రూ.40 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. పీహెచ్‌సీల ఆధునికీకరణకోసం ఒక్కో పీహెచ్‌సీకి రూ.2 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది.



ఫ్యామిలీ ఫిజీషియన్‌లో భాగంగా దావులూరులో రోగి ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు(ఫైల్)

పెరిగిన 104, 108 వాహనాలు..

గతంలో 108 వాహనాలు 26 ఉండగా, నేడు 64కు ప్రభుత్వం పెంచింది. 104 వాహనాలు గతంలో 24 ఉండగా, నేడు 66కు ప్రభుత్వం పెంచింది. వాహనాల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించడంతోపాటు వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేసి ఉచితంగా వైద్య సేవలు ప్రభుత్వం అందిస్తోంది.

జీజీహెచ్‌లో 'నూతన' ఉత్తేజం..



75 ఏళ్ల చరిత్ర కల్గిన గుంటూరు వైద్య కళాశాలలో మొట్టమొదటిసారిగా కళాశాల ప్రిన్సిపాల్ పోస్టును అడిషనల్ డీఎంఈ పోస్టుగా అప్‌గ్రేడ్ చేశారు. వైద్య కళాశాలలో ఒకేసారి 15 అసోసియేట్ ప్రొఫెసర్లు, 15 ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లను నూతనంగా మంజూరు చేసి ప్రభుత్వం భర్తీ చేసింది. సుమారు 25 ఏళ్లకుపైగా ఖాళీగా ఉన్న 40 పారామెడికల్ పోస్టులను సైతం భర్తీ చేసింది. పీజీ సీట్లు వైద్య కళాశాల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 46, ఆరు సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు మంజూరు చేసింది. ఎమర్జెన్సీ మెడిసిన్, హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్, సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ అంకాలజీ వైద్య విభాగాలు, న్యూరో సర్జరీ, యూరాలజీ వైద్య విభాగాల్లో అదనపు యూనిట్లు మంజూరు చేసింది.

ఆరోగ్య కేంద్రాల్లో స్పెషాలిటీ వైద్య సేవలు ...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎన్నడూ లేని విధంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే ఆరోగ్య కేంద్రాల్లో సైతం స్పెషాలిటీ వైద్య సేవలు రోగులకు నేడు అందుతున్నాయి. పీహెచ్‌సీలను నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా కోట్లాది రూపాయలతో ఆధునికీకరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 87 పీహెచ్‌సీలు ఉండగా నూతనంగా 15 ప్రభుత్వం మంజూరు చేసింది. గతంలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, నర్సుల పోస్టులు భర్తీ చేయడంతోపాటు ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంది. గతంలో జిల్లావ్యాప్తంగా 17 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా, ప్రభుత్వం 30 నూతనంగా ఆరోగ్య కేంద్రాలు మంజూరు చేసి వాటిని పట్టణ ఆరోగ్య కేంద్రాలుగా పేరు మార్చింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫ్యామిలీ ఫిజీషియన్, జగనన్న ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాలు ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ముఖ్యమంత్రి స్వయంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ పీహెచ్‌సీ

ఆధునిక వైద్య పరికరాలు...



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక రూ. 65 కోట్ల విలువ చేసే వైద్య పరికరాలు ఆస్పత్రికి వచ్చాయి. కార్పొరేట్ ఆస్పత్రుల కంటే దీటుగా నేడు జీజీహెచ్ వైద్యులు ఆపరేషన్లు చేస్తున్నారు. రూ.18లక్షల ఖరీదు చేసే కాక్లియర్ ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారు. తల్లి, బిడ్డకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా రూ. 86 కోట్లతో 600 పడకలతో ఎంసీహెచ్ భవన నిర్మాణం జరుగుతోంది. జీజీహెచ్‌లో 1500 పడకలకు రూ. 3 కోట్లతో ఆక్సిజన్ సౌకర్యం, రూ.కోటి ఖరీదుచేసే ఆక్సిజన్ ప్లాంట్లు నాలుగు, ఒక్కోటి రూ.3.5లక్షల ఖరీదు చేసే 250 వెంటిలేటర్లు, ఒక్కొక్కటి రూ.లక్ష ఖరీదు చేసే మల్టీచానల్ మానిటర్స్ 40, ఒక్కొక్కటి రూ.3 లక్షలు ఖరీదు చేసే డిఫ్రిబిలేటర్స్ 10, ఒక్కోటి రూ. 20 లక్షలు ఖరీదు చేసే సీఆమ్ పరికరాలు నాలుగు, ఒక్కొక్కటి రూ. ఆరు లక్షలు ఖరీదు చేసే వర్క్ స్టేషన్లు ఆరు, ఒక్కొక్కటి రూ. 2 లక్షలు ఖరీదు చేసే హైఫ్రిక్వెన్సీ మిషన్లు 20, ఒక్కొక్కటి రూ. లక్ష ఖరీదు చేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు 250, ఒక్కొక్కటి రూ. 4 లక్షలు ఖరీదు చేసే ఆర్థోపెడిక్ డ్రిల్ సెట్ నాలుగు ఇలా చెప్పుకొంటూ పోతే మరెన్నో ఆధునిక పరికరాలను ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం జీజీహెచ్‌కు అందజేసింది. ఆసుపత్రికి, వైద్య కళాశాలకు రూ.750 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయడంతోపాటు, నూతన భవనాల నిర్మాణాలకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పారామెడికల్, నాల్గోతరగతి ఉద్యోగాలు 123, స్టాఫ్ నర్సుల పోస్టులు 250 మంజూరు చేసి భర్తీచేసింది.

జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలకునిగా యూపీ డీఐజీ

డీపీఓలోని పలు విభాగాలను పరిశీలించిన డీఐజీ సత్యార్థ్ అనిరుద్ పంకజ్

నగరంపాలెం: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ అధికార, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా పోలీస్ ఎన్నికల పరిశీలన అధికారి, ఉత్తరప్రదేశ్ డీఐజీ సత్యార్థ్ అనిరుద్ పంకజ్ ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూం, పోలీస్ కంట్రోల్ రూం, సోషల్ మీడియా విభాగం, ఐటీ కోర్ టీం, ఎలక్షన్ సెల్ ఇతరత్రా విభాగాలను గురువారం డీఐజీ ఆకస్మికంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు, కంప్యూటర్ల పనితీరు పరిశీలించగా, వాటి సామర్థ్యాన్ని డీఐజీకి జిల్లా ఎస్పీ తుషార్ డూడీ వివరించారు.



సీసీ కెమెరాల పనితీరును డీఐజీకి వివరిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా, ప్రభుత్వ శాఖలతో కలిసి ముందుకెళ్లాలని అన్నారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం లేకుండా చూడాలన్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. జిల్లాలోని పరిస్థితులను ఎప్పటికప్పుడు సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల వేళల్లో పోలీస్ కంట్రోల్ రూం, ఇతరత్రా విభాగాల్లోని సిబ్బంది సత్వరమే స్పందించాలని, ఫోన్ చేసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. డీఐజీ వెంట జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, ఎన్నికల నోడల్ అధికారి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన), జీవీ రమణమూర్తి, సీఐలు శివప్రసాద్ (కంట్రోల్ రూం), మౌలాషరీఫ్ (సోషల్ మీడియా ఐటీ కోర్ టీం), జిల్లా ఎన్నికల సెల్ పోలీస్ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ

గుంటూరు మెడికల్: వరల్డ్ మలేరియా డే సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్లకార్డులతో మలేరియా నివారణ చర్యలపై నినాదాలు చేశారు. ర్యాలీ నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు కొనసాగింది. ఈ సంవత్సరం నినాదమైన 'ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దాం' అన్న లక్ష్యంతో ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ కె.వి.సుబ్బరాజు, డాక్టర్ ఇ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్స్, హెల్త్ సూపర్‌వైజర్స్, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, వైద్యాధికారులు

క్లుప్తంగా

ఎన్నికల పరిశీలకునితో జిల్లా ఎస్పీ భేటి



పరిశీలకునితో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

నగరంపాలెం: జిల్లాలోని తెనాలి, పొన్నూరు, మంగళగిరి అసెంబ్లీ నియోజక వర్గాల జనరల్ ఎన్నికల పరిశీలకునిగా నియమితులైన హిమాచల్‌ప్రదేశ్ ఐఏఎస్ అధికారి నీరజ్‌కుమార్ గురువారం జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేశారు. ఈ మేరకు ఆయన్ను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతి, భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహణకు జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన ముందస్తు చర్యలను ఆయన దృష్టికి జిల్లా ఎస్పీ తీసుకొచ్చారు.

పోలింగ్ స్టేషన్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత చర్యలు, అక్రమ మద్యం, నగదు, ఇతరత్రా వస్తువుల అక్ర మ రవాణాను కట్టడి చేసేందుకు అమలు చేస్తున్న చర్యలపైనా కూలంకషంగా వివరించారు. మంగళగిరి, తెనాలి పొన్నూరు అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎన్నికలకు సంబంధించి ఏదైనా సమాచారం ఉన్నట్లయితే 9154882127 నంబర్‌కు ఫోన్ చేయాలని, తద్వారా సంబంధిత అధికారులతో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

భవిష్యత్ కోసం వైఎస్సార్ సీపీకి పట్టంకట్టాలి



మాట్లాడుతున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, పక్కన విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు ముస్తఫా, గిరి, ఎమ్మెల్సీలు మర్రి, చంద్రగిరి, అభ్యర్థి నూరిఫాతిమా తదితరులు

- అలుపెరుగని సైనికుల్లా పనిచేద్దాం
- రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- గుంటూరు తూర్పు వైఎస్సార్ సీపీ నేతలతో ఆత్మీయ సమావేశం

పట్నంబజారు: భవిష్యత్ తరాల మేలు కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పిలుపునిచ్చారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ నేతల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశానికి పార్టీ తూర్పు అభ్యర్థి షేక్ నూరిఫాతిమా అధ్యక్షత వహించారు. శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో పాటు పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు కేవలం 15 రోజుల మాత్రమే సమయం ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ అలుపెరుగని సైన్యంలా ముందుకు సాగాలన్నారు. పేదవర్గాలకు మేలు చేసి.. తాను అణగారిన వర్గాల ప్రజల వ్యక్తినని సీఎం వైఎస్ జగన్ చాటి చెప్పారని శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చెప్పారు. వైఎస్సార్ సీపీలో నాయకులు, కార్యకర్తలు అనేక బేధం లేదని, ఇక్కడ మనమంతా ఒకే కుటుంబమని శాసనమండలి విప్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టిన తరువాత విప్లవాత్మక నిర్ణయాలను తీసుకుని వాటిని అమలు చేసి.. పేదలకు ఎంతో మేలు చేశారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. పశ్చిమ నియోజవకర్గ ఎమ్మెల్యే, పార్టీ నగర అధ్యక్షుడు మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం సీఎం వైఎస్ జగన్ ద్వారానే సాధ్యపడుతుందన్నారు. ఎమ్మెల్సీ, తూర్పు నియోజకవర్గ పరిశీలకులు మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం ఏర్పరిచి, ప్రతి ఇంటికి సేవలు అందిస్తూ.. ఎటువంటి వివక్ష లేకుండా రూ 2.70 లక్షల కోట్లు ప్రజల సంక్షేమాన్ని అందించారన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలవటం తథ్యమన్నారు. మీ ఇంట్లో మంచి జరిగితేనే ఓటు వేయండమ్మ.. అని నిస్వార్థంగా అడుగుతున్న సీఎం వైఎస్ జగన్ పరిపాలనపై ఉన్న నమ్మకాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ నూరిఫాతిమా చెప్పారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ నేతలు రావెల కిషోర్ బాబు, గులాంరసూల్, డాక్టర్ వై. షేక్, చందు సాంబశివరావు, మనోరంజిని, నాగమల్లేశ్వరి, జియాఉర్ రెహ్మాన్, పార్టీ నేతలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

జగనన్నకు జనమే సైన్యం

వైఎస్సార్ సీపీ పొన్నూరు ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి మురళీకృష్ణ



పార్టీలో చేరిన వారితో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని, ఆయన పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారన్నారు. పచ్చల తాడిపర్రు గ్రామ సర్పంచ్ పెరికల కృష్ణమోహన్ ఆధ్వర్యంలో గురువారం అంబటి మురళీకృష్ణ సమక్షంలో గ్రామ జనసేన పార్టీకి చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో అంబటి మురళీకృష్ణ వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సీఎం జగన్‌కు జనమే సైన్యమని అన్నారు. ఈ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో కూటమితో మోసం చేసేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడని విమర్శించారు. పార్టీలో చేరిన వారిలో జనసేన నాయకులు హరి శివరామకృష్ణ, యాంపాటి లక్ష్మీనారాయణ, యాంపాటి ఆంజనేయులు, హరి మహేష్, వల్లంశెట్టి జగదీష్, పసుపులేటి సాయి, షేక్.బాబావలి, బడుగు రవి తదితరులు ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీచైతన్య విజయకేతనం



విద్యార్థులతో ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్లు, ప్రిన్సిపాల్స్

గుంటూరు ఎడ్యుకేషన్: జేఈఈ మెయిన్స్–2024 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థల విద్యార్థులు విజయకేతనం ఎగుర వేసినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ తెలిపారు. లక్ష్మీపురంలోని సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అన్ని కేటగిరీల వారీగా ఎస్. భార్గవ్ సాయి రాజ్ 36వ ర్యాంకు, కె. సుమంత్‌రెడ్డి 70వ ర్యాంకు, పి. పవన్‌కుమార్ 131వ ర్యాంకు, కె. లోకేష్ 157వ ర్యాంకు, షేక్ రియాజ్ 166వ ర్యాంకు, ఎస్.వెంకట అశ్విత 340వ ర్యాంకు, కె. రమణగోపాల్ 394వ ర్యాంకు, పి.జ్యోతిక 410వ ర్యాంకు, కె. తేజ వర్ధన్ 629వ ర్యాంకు, వి. స్నేహ ప్రియ 683వ ర్యాంకు, పి. మణికంఠ 793వ ర్యాంకు, జి. రుషితారెడ్డి 924వ ర్యాంకుతో పాటు వెయ్యి లోపు 12, రెండు వేల లోపు 35, ఐదు వేలలోపు 72, 10వేల లోపు 153 మంది ర్యాంకులను సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్లు కిషోర్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణ, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్స్ బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందించారు.

దోమలను నిర్మూలించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో



ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

నరసరావుపేట: ఇళ్లు, వాటి పరిసరాల్లో దోమలు వృద్ధికాకుండా నీరు నిల్వ ఉండకుండా చేసి ప్రజారోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి ప్రజలకు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లల్లో వాడని వస్తువుల్లో వారం, అంతకు మించి నీరు నిల్వ ఉండకుండా చేయాలన్నారు. నిల్వ ఉండే మంచినీటిలో దోమ 100 నుంచి 150 గ్రుడ్లు పెడుతుందని, అవి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో దోమలుగా వృద్ధిచెంది ప్రజలపై దాడి చేస్తాయన్నారు. ఇవి కుట్టడం వల్ల మలేరియాతో పాటు డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆషా కార్యకర్తలు దోమలు నిర్మూలిద్దాం–వాటి ద్వారా వచ్చే వ్యాధులను అరికడదాం, శుభ్రత ఉంటే ఆరోగ్యం–లేకుంటే అనారోగ్యం, దోమలపై యుద్ధం–మన జీవితాలకు భద్రం, దోమ తెరలు వాడండి–దోమ కాటును నివారించండి, దోమకాటు ప్రజారోగ్యానికి చేటు, ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు, నీటితొట్టిపై మూత–దోమల పెరుగుదలకు కోత వంటి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, పీఎండీవో రామకృష్ణ, సీహెచ్‌వోలు రామకృష్ణ, సుబ్బారెడ్డి, సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

వరిచెత్త వేసి ద్విచక్ర వాహనం దహనం



దగ్ధమైన ద్విచక్ర వాహనం

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనాన్ని వరిచెత్త వేసి దగ్ధం చేసిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేరంగుల వెంకటేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పెట్టుకొని నిద్ర పోతున్న సమయంలో ఆయన బావ టీడీపీ కార్యకర్త నాగమల్లయ్య ద్విచక్ర వాహనం పై వరిగడ్డి వేసి నిప్పు పెట్టడంతో వాహనం కాలిపోయింది. వాహనం పై మంటలు ఎగసి పడుతుండటంతో వెంకటేష్ బయటకు వచ్చి వాహనం పై నీళ్ళు మంటలు ఆర్పాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

‘నవ’ భారతం పుస్తకానువాదం అభినందనీయం

- ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జస్టిస్ కేజీ.శంకర్
- రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు చేస్తోన్న బీజేపీ



మాట్లాడుతున్న విశ్రాంత జస్టిస్ శంకర్, వేదికపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నర్రా శ్రీనివాసరావు, కుమార్

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): అష్ట వంకరల ‘నవ’ భారతం పేరుతో ముద్రించిన పుస్తకం తెలుగులో అనువదించం అభినందనీయమని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత జస్టిస్ కేజీ.శంకర్ అన్నారు. గుంటూరు బుక్ రీడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ పరకాల ప్రభాకర్ రచించిన అష్ట వంకరల ‘నవ’ భారతం (సంక్షోభంలో గణతంత్ర వ్యవస్థ) పుస్తక పరిచయ సభ గురువారం రాత్రి గుంటూరు బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్‌లో జరిగింది. సభకు ఏపీ మెడికల్ / సేల్స్ రిప్రజెంటేటివ్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత జస్టిస్ శంకర్ మాట్లాడుతూ ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య వ్యవస్థపై పలు అంశాలను ప్రస్తావించారని పేర్కొన్నారు. ఎన్నికలకు కులంతో సంబంధం లేదని, కొన్ని పార్టీలు హిందూత్వమని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తకం చదవాలని, ఒక గైడ్‌గా ఉపయోగపడనుందని చెప్పారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గత పదేళ్లల్లో మోదీ నాయకత్వంలో బీజేపీ అనుసరిస్తోన్న విధానాలకు ప్రతిబింబంగా అష్ట వంకరల నవభారతం పుస్తకం ఉందని, గణాంకాలు, ఆధారాలతో సహా ముద్రించారని పేర్కొన్నారు.

బీజేపీకి రాజ్యాంగంపై గౌరవంలేదని, రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు చేస్తోందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ ఆలోచనలను మోదీ, అమిత్ షా అమలు చేస్తున్నారని విమర్శించారు. ఈ పుస్తకంలో 23 వ్యాసాలు ఉండగా, ఒక్కొక్క వ్యవస్థపై పలు వ్యాసాలతో ముద్రించారని పేర్కొన్నారు. బీజేపీకి పార్లమెంటరీ వ్యవస్థపై కంటే అధ్యక్ష పాలనపై తొలినాళ్ల నుంచి మోజు ఉందని మండిపడ్డారు. దేశంలో అసమానతలు, నిరుద్యోగం పెరగ్గా, నైపుణ్యాలు పూర్తిగా తగ్గాయని ఆరోపించారు. దేశ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిందని ఆరోపించారు. ప్రతినెలా ఒక పుస్తకంపై చర్చా కార్యక్రమం నిర్వహిస్తామని మన మంచి పుస్తక ఆర్గనైజర్ కాపు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీజేపీ 2104–24 గణతంత్ర వ్యవస్థ ఏ విధంగా సంక్షోభంలోకి తీసుకెళ్లారనేది ఈ పుస్తకంలో పొందుపరిచారని చెప్పారు. సభలో ఏఐఎల్‌యూ రాష్ట్ర కార్యదర్శి నర్రా శ్రీనివాసరావు మాట్లాడగా, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పలువురు పుస్తక ప్రియులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి




రెంటాల పోలింగ్ బూత్‌లను పరిశీలించి పరిస్థితులను తెలుసుకుంటున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

రెంటచింతల: సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు.గురువారం ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అకస్మికంగా రెంటాల గ్రామంలోని 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. ఏర్పాటు చేసిన వెబ్ సీసీ కెమెరాల పనితీరు ఎలా ఉందని ప్రశ్నించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఎవరి ఓటు వారు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఎన్ని ఉన్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఓటర్లలో మనం పూర్తి మనోధైర్యం కల్పించాలన్నారు. రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామం పరిస్థితి ఏమిటి..ఇక్కడ ఓటర్లు ఎంతమంది ఉన్నారు.. పోలింగ్ ఎలా జరుగుతుంది..పోలింగ్ శాతం ఎంతవరకు ఉంటుంది..ఎన్నికల సమయాల్లో ఇక్కడ ఎలాంటి పరిస్థితులు ఉంటాయి..ఎందుకు సమస్యాత్మ కమైన గ్రామం అని ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచికల్లు గ్రామాలలోని 243, 244, 245, 246 పోలింగ్ బూత్‌లను కూడ సందర్శించి పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని గుర్తుంచుకోవాలని ఓటర్లకు రక్షణ కల్పించడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజలు ధైర్యంగా వారి ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక దళాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయందోళనకు గురి చేసినా, వారి ఓటు హక్కుకు భంగం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట గురజాల డిఎస్పీ పల్లపురాజు, ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి తదితరులున్నారు.

కుమారుడు డబ్బులు పంపలేదని తల్లి బలవన్మరణం

గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో విషాద సంఘటన



మండల లక్ష్మీదేవి మృతదేహం

నాదెండ్ల: పనికి వెళ్ళిన కుమారుడు సరిపడా డబ్బులు పంపలేదనే మనస్తాపంతో తల్లి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల లక్ష్మీదేవి (36) రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటుంది. మృతురాలి భర్త రాముడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు శివరామ్‌తో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కుమారుడు శివరామ్ పది రోజుల క్రితం రేకులు కప్పే పని ఒప్పుకుని నెల్లూరుకు వెళ్ళాడు. బుధవారం ఉదయం లక్ష్మీదేవి ఇంటి ఖర్చుల కోసం డబ్బులు కావాలని కుమారునికి ఫోన్‌చేసి అడగడంతో వెయ్యి రూపాయలు మాత్రమే పంపాడు. తనకు ఇవి సరిపోవని, మరికొంత పంపాలని, లేదంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆపై ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను ఆటోలో చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.15 గంటలకు మృతి చెందింది. లక్ష్మీదేవి బంధువైన నాగజ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు చెక్‌పోస్టుల్లో రూ.3.19 లక్షల నగదు స్వాధీనం

చిలకలూరిపేట టౌన్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా రెండు చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.19 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలం పరిధిలోని ఈటీ చెక్‌పోస్టు వద్ద రూ.1.50 లక్ష నగదును చిలకలూరిపేట ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు తమ సోదాల్లో పట్టుకోగా, బొప్పూడి చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్ఎస్‌టీమ్ అధికారులు రూ.1.69 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అన్నీ తానై తనయుడిని తీర్చిదిద్దిన అమ్మ

- పుట్టుకతోనే బుద్ధి మాంద్యంతో బాధపడుతున్న మాధవ అఖిలేష్
- పది పరీక్షల్లో 456 మార్కులు
- సాధారణ విద్యార్థులతో పోటీ పడి ఉత్తీర్ణత
- విద్యాబోధన చేసిన మాతృమూర్తి
- ఇంట్లో ఉపాధ్యాయినిగా ఉంటూ పీహెచ్‌డీ చేస్తున్న అమరేశ్వరి



తల్లిదండ్రులు అమరేశ్వరి, రాముతో మాధవ అఖిలేష్

గుంటూరు ఎడ్యుకేషన్: ఒక తల్లిగా బిడ్డకు జన్మనివ్వడమే కాకుండా బిడ్డ కోసం ఎన్నో త్యాగాలు చేసింది ఆ మాతృమూర్తి. జీవితంలో ఉన్నతస్థాయిలో స్థిరపడే అవకాశాలను వదులుకుని అనుక్షణం తనయుడి కోసం తపిస్తోంది. పుట్టుకతోనే బుద్ధి మాంద్యం (ఆటిజం) సమస్యతో ఉన్న తనయుడికి పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలకు మించి, ఇంట్లో తానే ఒక గురువుగా మారి తనయుడిని విద్యావంతుడిగా తీర్చిదిద్దింది. వివరాలు..

గుంటూరులోని సాయిబాబారోడ్డుకు చెందిన తాయా మాధవ వెంకట సాయి జగన్ అఖిలేష్ భాష్యం హైస్కూల్లో చదివి, ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు 456 సాధించాడు. విద్యార్థి తల్లిదండ్రులు అమరేశ్వరి, రాము. దాచేపల్లిలో నివాసముంటున్న సమయంలో 2011లో నాలుగేళ్ల వయసులో వీరి తనయుడు మాధవ అఖిలేష్ మాటలు సక్రమంగా మాట్లాడకపోవడం, ప్రవర్తనలో మార్పు గమనించారు. గుంటూరు తీసుకొచ్చి వైద్యులకు చూపించగా, ఆటిజం అని నిర్ధారించారు.

ప్రత్యేక పాఠశాలలో చేర్పించి శిక్షణ ఇప్పించడం ద్వారా కొంత ప్రయోజనం ఉంటుందని చెప్పడంతో కుమారుడి కోసం అప్పట్లో దాచేపల్లి నుంచి కుటుంబంతో సహా గుంటూరు వచ్చారు. గుంటూరులో ప్రత్యేక అవసరాలు గల పిల్లల పాఠశాలల్లో చేర్పించి, నాలుగేళ్లపాటు శిక్షణ ఇప్పించారు. తరువాత ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు వివిధ పాఠశాలల్లో తోటి విద్యార్థులతో పాటు సాధారణ విద్యార్థిగా చేర్పించి, చదువు చెప్పించారు. ఎమ్మెస్సీ బీఈడీ (భౌతికశాస్త్రం) చదివిన విద్యార్థి తల్లి అమరేశ్వరి ప్రభుత్వశాఖల్లో ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమైనప్పటికీ, తనయుడిని చూసుకునేందుకు ఆ ప్రయత్నానికి స్వస్తి పలికారు. తండ్రి రాము ఫ్లిప్‌కార్ట్‌లో డెలివరీ అసోసియేట్‌గా పని చేస్తున్నారు. 6వ తరగతి నుంచి భాష్యం హైస్కూల్లో చేర్పించారు.

పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను వినడం మినహా, తిరిగి మాట్లాడటం, ఉపాధ్యాయులు అడిగే ప్రశ్నలకు సమాధానాలవ్వడం వంటివి మాధవ్ అఖిలేష్ చేయలేడు. దీంతో పాటు ఆటిజం సమస్యతో బాధ పడుతున్న వాళ్లు సమూహంలో ఉండటం కంటే ఒంటరిగా ఉండేందుకే ఇష్టపడతారు. పాఠశాలలో ఉపాధ్యాయులు ఎంత చెప్పినా, ఇంట్లో ఉపాధ్యాయురాలిగా, స్నేహితురాలిగా వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని విద్యార్థి తల్లి అమరేశ్వరి పోషించిన పాత్ర వలనే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ధైర్యంగా ఎదుర్కొన్నాడు.

ప్రస్తుతం విద్యార్థికి 17 ఏళ్లు. టెన్త్‌లో సాధారణ విద్యార్థులతో పోటీపడి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాడు. కాగా విద్యార్థి తల్లి ఇంటి వద్ద ట్యూషన్లు చెప్పుకుంటూ, ఏఎన్‌యూలో పీహెచ్‌డీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. బీఈడీ పూర్తి చేయడంతో పాటు సైన్స్ సబ్జెక్టు కావడంతో కుమారుడికి ఇంట్లోనే విద్యాబోధన చేసింది. అన్నీ తానై చూసుకుని తనయుడిని తీర్చిదిద్దిన అమరేశ్వరిని పాఠశాల యాజమాన్యంతో పాటు స్థానికులు అభినందించారు.